ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 : కనిష్ఠం 22.2



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 9 ఆగస్టు 2025

గిర్నూర్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం

బజార్ హత్నూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామంలో పశు వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ హైమాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులు గొర్రెలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధు లైన లంపి స్కిన్ (ముద్దచర్మ వాధి), బ్ల్యూటంగ్ (నీలి నాలుక) వంటి వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువుల్లో, గొర్రెలకు ఈ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ శిబిరంలో వెటర్నరీ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా వెలసిన దుకాణాలు

- పట్టణంలో రాఖీల కొనుగోలుదారులతో కిటకిటలాడిన ప్రధాన రహదారులు
- కాలానుగుణంగా అందుబాటులోకి వచ్చిన విభిన్న ఆకృతులు
- బంగారు, వెండి, కార్టూన్ బొమ్మలతో ప్రత్యేకం
- జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు

మార్కెట్లో రాఖీల సందడి

6



● వరలక్ష్మి అమ్మవారి వద్ద పూజలు జరుపుతున్న కలెక్టర్ రాజర్షి షా

- జిల్లాలో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గోపాల చంద్ర కృష్ణ మఠంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వ్రతాలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా
- గ్రామాలలో వాయినాలు ఇచ్చి.. పుచ్చుకున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

7



ఫైళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో స్రవంతి

భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

తాంసి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపాలని ఆర్డీవో స్రవంతి అన్నారు. తాంసి తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీటీ గణేష్ జాదవ్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సిబ్బంది అశోక్, వినోద్, స్రవంతి, ప్రశాంత్, స్వాగత్ తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కంది

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతోందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవ భవన్‌లో జైనథ్ మండలం కాప్రి, కూర గ్రామాలతో పాటు పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం 28 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. పేదల సంక్షేమాన్ని కాంక్షించి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్, రూ.ఐదు వందలకు గ్యాస్, సన్న బియ్యం తదితర పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు బాసటగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, జుబేద, బండారి సతీష్, అఖిల్ పాల్గొన్నారు.

జల్ జంగిల్ జమీన్.. అనే నినాదంతో.. ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీ వీరుడు కొమురంభీం స్ఫూర్తిగా ఆదివాసీలు అలుపెరగని పోరాటాలు చేస్తున్నారు. తమ హక్కులు, అస్థిత్వం కోసం నిరంతరంగా ఉద్యమాల బాట పడుతున్నారు. స్వాతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఆదివాసీ గిరిజన గ్రామాలు కనీస సౌకర్యాలకు నోచుకోవడమే లేదు. రాష్ట్రంలోనే ఖమ్మం, వరంగల్ జిల్లాల తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోనే ఆదివాసీలు ఎక్కువగా నివసిస్తున్నారు. తమ వెనుక బాటు తనానికి మరో గిరిజన తెగనే కారణమంటూ గత కొన్నేళ్లుగా ఆందోళనలు,ఉద్యమాలు చేస్తూ పోరుబాట పడుతున్నారు. అయిన ఇప్పటికి ఆదివాసీల సమస్యలు పరిష్కారానికి నోచుకోక వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే మారుతుంది.



● జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు (ఫైల్)

అలుపెరుగని.. పోరాటాలు

ఆదిలాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతియేటా నాగోబా మహాజాతర సందర్భంగా కేస్లాపూర్ గ్రామంలో ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదివాసీల రక్షణకు ఎన్నో ఏజెన్సీ చట్టాలు ఉన్న అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఏజెన్సీలో రెండు గిరిజన తెగల మధ్య ఆదిపత్యపోరు కొనసాగుతుంది. అయిన ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదంటున్నారు. తరాలు మారుతున్న తమ తలరాతలు మారడంలేదని ఆదివాసీలు వాపోతున్నారు. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 231 ఆదివాసీ గ్రామాలే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల జీవనాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఐక్యరాజ్య సమితి 1982 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతియేడు ఆగస్టు 9న ఆదివాసీలు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. శనివారం జిల్లావ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని పెద్దఎత్తున జరుపుకునేందుకు సభలు, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు.

జీవో రద్దుకు పట్టు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల మనుగడను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తూ తీసుకొచ్చిన జీవో నెం.49ని రద్దు చేయాలంటూ ఆదివాసీలు పట్టుబడుతున్నారు. ఇటీవల 49 జీవోను నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బంద్‌ను నిర్వహించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ 49జీవోను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆదివాసీలు మాత్రం పూర్తిగా రద్దు చేయాలంటూ పట్టుబడుతున్నారు. దీని కారణంగా ఆసిఫాబాద్, కొమురంభీం జిల్లాలో 326 గ్రామాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉందంటున్నారు. అలాగే కవ్వాల్ అభయారణ్యం నుంచి పులుల పేరిట ఆదివాసీ గ్రామాలను తరలించడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చట్టాల పేరిటా అటవీ శాఖాధికారులు పోడు సాగు, రోడ్ల నిర్మాణం, ఇళ్ల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అటవి శాఖాధికారుల తీరును తప్పుబడుతు హెచ్చరిస్తున్న పరిస్థితుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదంటున్నారు. ఉద్యమాలతో హక్కులు సాధించుకోవడం ఆదివాసీలకు పెద్దపనేమి కాదంటూ హెచ్చరిస్తున్నారు.

తరతరాలుగా అస్థిత్వం కోసం ఆదివాసీల ఆరాటం

- జీవో 49ని పూర్తిగా రద్దు చేయాలంటూ డిమాండ్
- వెంటాడుతున్న నిరక్షరాస్యత, రక్తహీనత సమస్యలు
- ఏజెన్సీ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కరువు
- ఏళ్లు గడుస్తున్నా.. అమలుకు నోచుకోని 1/70, ఏజెన్సీ చట్టాలు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం.. ఏర్పాట్లు చేస్తున్న ఆదివాసీలు

శాపంగా మారిన రక్తహీనత

తరతరాలుగా ఆదివాసీలను రక్తహీనత సమస్య వెంటాడుతు వారికి శాపంగా మారుతుంది. యేటా రక్తహీనత సమస్యతో ఏజెన్సీలో పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల రక్తహీనత సమస్యతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థులను గురుకుల పాఠశాల నుంచి ఇంటికి పంపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఆదివాసీ మహిళలను రక్తహీనత సమస్య వెంటాడుతునే ఉంది. వీరికి ప్రసవమంటే పునర్జన్మగా మారుతుంది. సరైన వైద్యం అందక పోవడంతో మాతా శిశు మరణాల రేటు పెరగడం ఆందోళన రేపుతుంది. ఆదివాసీలు ఎక్కువగా తమ ఆచార సాంప్రదాయాలకు కట్టుబడి మూఢ విశ్వాసాలతో జీవనం సాగిస్తున్నారు. పౌష్టికాహార లోపంతో ఆదివాసీలు బక్కచిక్కి పోయి బలహీన పడిపోతున్నారు. దీంతో భయంకర వ్యాధులు చుట్టుముట్టి యేటా ఎందరో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. దీనంతటికి నిరక్ష్యరాస్యతే ప్రధాన కారణమని స్పష్టమవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో మెరుగైన విద్య అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఏజెన్సీలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయడం కలగానే

(తరువాయి 6వ పేజీలో....)

జాతి కోసం దేనికైనా సిద్ధమే..

: సోయం బాపురావు, రాష్ట్ర రాజ్‌గోండ్ సేవా సమితి అధ్యక్షుడు



ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసేందుకు దేనికైనా సిద్ధంగానే ఉన్నాం. పోరాటాల ఫలితంగానే హక్కులను సాధించుకున్నాం. కొమురంభీం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలను చేపడుతాం. రాష్ట్ర వ్యాప్తంగా రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. విద్యతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమవుతుంది. ఏజెన్సీ చట్టాలపై అందరూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. జీవో నెం. 49ని రద్దు చేసేందుకు రాష్ట్రపతితో పాటు దేశ ప్రధానిని కలవడం జరిగింది. త్వరలోనే జీవోను రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం.

34 మంది సీఆర్‌టీల నియామకం

ఉట్నూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గతనెల 27న ఉట్నూర్, ఆసిఫాబాద్‌లలో నిర్వహించిన కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల రాత పరీక్ష ఆధారంగా ఈనెల 6న ఉట్నూర్ మండల కేంద్రంలో డెమో నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గురువారం 34 మందిని ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో నియామకాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న సిఆర్టీల నిమామకం కోసం ఐటీడీఏ అధికారులు నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి మూడు వేలకుపైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. కాగా, ఐటీడీఏ పీవో 34 మందిని నియమిస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అదిలాబాద్ జిల్లాలో 20 మందిని, నిర్మల్‌లో ఎనిమిది మందిని, ఆసిఫాబాద్‌లో ఆరుగురిని నియమించడంతో.. వారికి కేటాయించిన పాఠశాలల్లో శుక్రవారం జాయిన్ కావడానికి చేరుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు : పీవో

ఉట్నూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చదువుల్లో ఉత్తమ ఫలితాలు కనబడుతున్న గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం జైనూర్ మండలంలోని గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థికి ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్ అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు. జైనూర్ మండలం శివనూర్ గ్రామానికి చెందిన రాథోడ్‌పవన్ జేఈఈ మెయిన్స్ చదువుల కోసం వారి తల్లిదండ్రుల సమక్షంలో పైచదువుల నిమిత్తం ల్యాప్‌టాప్‌లను అందించడం జరిగిందని తెలిపారు.



గిరిజన విద్యార్థికిలాప్‌టాప్ పంపిణీ చేస్తున్న పీవో

కలెక్టర్ ఆదేశాలతో జొన్నల వ్యాపారిపై విచారణ

బోథ్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతుల పంట బోథ్ మండల కేంద్రానికి చెందిన రతన్ అనే వ్యాపారి కొనుగోలు చేయడం జరిగింది. అయితే కొనుగోలు చేసిన వ్యాపారి పరారీకావడంతో రైతులు ఆందోళన వ్యక్తపరిచారు. అయితే ఇటీవల మండల కేంద్రంలో వచ్చిన జిల్లా కలెక్టర్‌కు జరిగిన సంఘటనపై కనుగుట్ట గ్రామానికి చెందిన రైతులు చేశారు. ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామితో పాటు మార్కెటింగ్ ఆఫీసర్ గజానందులు రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. జరిగిన సంఘటనపై రైతులను అడగగా తమకు మధ్యవర్తులుగా ఇద్దరు బోథ్‌కు చెందిన వారు ఉన్నారని వివరించారు. మధ్యవర్తిగా వ్యవహరించిన వారిని పిలిపించి ప్రచారం చేశారు. తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. ఏది ఏమైనా జొన్నపంట కొనుగోలు చేసి రైతులను నిండా ముంచిన వ్యాపారి ఆస్తులను గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి వెళ్లిపోవడం వల్ల పంట విక్రయించిన రైతుల్లో ఆందోళన నెలకొంది.



బోథ్‌లో జొన్న పంట వ్యాపారి డబ్బుల విషయమై విచారం చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



ఉట్నూర్ డిపో నుంచి ప్రారంభించిన నిర్మల్ బస్సు

ఎట్టకేలకు ప్రారంభమైన నిర్మల్ బస్సు

ఉట్నూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఎట్టకేలకు ఉట్నూర్ నుంచి నిర్మల్ బస్సును ప్రారంభించారు. చిరకాలంగా ఉట్నూర్ ప్రాంత ప్రయాణికుల కోసం ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ మీదుగా నిర్మల్‌కు, ఉట్నూర్ నుంచి కడెంఖానాపూర్ మీదుగా నిర్మల్‌కు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసి ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని గతనెల రోజుల క్రితం ఉట్నూర్ ఇన్చార్జి డీఎం ను ఖానాపూర్ ఎమ్మెల్యే కోరారు. ఆర్టీసీ డిపోలో ఉన్న బస్సుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ముందుగా గుడిహత్నూర్ మీదుగా నిర్మల్ కు ప్రతిరోజు రెండుసార్లు ఉదయం ఏడు గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు బస్సు సర్వీసు బయలుదేరుతుందని డిపో సిబ్బంది ఈ సందరంగా పేర్కొన్నారు.

పోరాట యోధుడు పండుగ సాయన్న

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా.. పేదలకు అండగా అనేక పోరాటాలు చేసిన మహనీయుడు పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు దారవేణి రాము అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట గల సాయన్న విగ్రహ ఏర్పాటు స్థలం వద్ద ఆయన 135వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పండుగ సాయన్న చేసిన పోరాటలు, చరిత్రను కనుమరుగు చేశారని, ముదిరాజులు ఏకమైన తమ పూర్వీకుల త్యాగాలు, పోరాటల గురించి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సాయన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి దర్శ రవి, బొజ్జ సంతోష్, శైలెంద్ర శివయ్య, సత్యనారాయణ, దాసరి రాము, పొచ్చన్న, భూమన్న, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.



పండుగ సాయన్నకు నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

ఆరోగ్య పాఠశాలను క్రమం తప్పకుండా అమలు చేయాలి : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పాఠశాలను క్రమం తప్పకుండా అమలు చేస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాటశాలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పాటశాలల్లో స్టూడెంట్ ఛాంపియన్‌గా ఎంపికైన వారికి ప్రశంస పత్రాలతో పాటు టీ షర్టులు అందించారు. విద్యార్థుల సలహాలను సైతం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... ప్రతి నెలా పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని తెలియచేయలని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు, ఇతర మరమ్మతులు అవసరమని ఉపాధ్యాయులు చెప్పారని, వాటి వివరాలను తెలియజేస్తే నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య పాఠశాల ద్వారా విద్యార్థులకు మంచి అలవాట్లతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసరెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, డీఎండబ్ల్యూవో మనోహర్, సెక్టోరియల్ అధికారి రఘు రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాసర సరస్వతి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చండి : ఎంపీ నగేష్

ఆదిలాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో ఉన్న బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పథకంలో చేర్చాలని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్‌ర్‌సింగ్ షెకావత్‌ను కలిసి ఎంపీ గోడంనగేష్ వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం పలువురు కేంద్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యూ) మం డలానికి గిరిజన ఏకలవ్య, గిరిజన మోడల్ పాఠశాలలను మంజూరు చేయాలని గిరిజన శాఖ మంత్రి జుయేల్ ఓరమ్ కోరారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో నవోదయ పాఠశాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే పలు సమస్యల పై కేంద్ర మంత్రులతో చర్చించారు. దీంతో కేంద్ర మంత్రులు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు
పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవు

● కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్
● బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పలువురు నాయకులు

తలమడుగు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆడే గజేందర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అభివృద్ధిని చూసి బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. అనంతరం తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ శానం భూమన్న, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, మైనార్టీ నాయకులు, షేక్ సిలార్,షబ్బీర్‌తో పాటు 25 మంది బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గోక గణేష్ రెడ్డి, బొల్లారం బాబన్న, మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు, యువజన కాంగ్రెస్ నాయకుడు పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, గంధం తిరుపతి, వెంకటి యాదవ్, లచ్చన్న, నర్సింలు,రావుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ మాజీ ఎంపీటీసీ ఉప్పు పోశెట్టి, అదే గ్రామానికి చెందిన షేక్ నసీర్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడు రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊశన్న, పాల శంకర్, మహేందర్, చంద్రశేఖర్, బొలిశెట్టి రాములు, ఇసాక్, రామకృష్ణ, గంధం నవీన్, వీరన్న, తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ఘోరం జరిగింది. 78 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వృద్ధురాలిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బలవంతంగా లైంగికదాడి చేసిన ఘటన రోజు రోజుకి పడిపోతున్న మానవ విలువలకు అద్దం పడుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన ఓవృద్ధు రాలు (78) శివాజీచౌక్‌లో రోడ్డు పక్కన పడుకుని ఉండగా... ఓదుండగుడు అర్థరాత్రి సమయంలో బలవంతంగా ఎత్తుకొని వెళ్లాడు. పక్కనే సందులో ఉన్న దుకాణం వద్ద వృద్ధురాలి నోట్లో గుడ్డలు కుక్కి లైంగికదాడి చేశాడు. బాధితురాలికుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బార్‌లో సిబ్బందిపై దాడి.. ఒకరి అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లోని ఓబార్‌లో సిబ్బందిపై ఇద్దరు దాడికి దిగిన ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీ.ఐ సునీల్ కుమార్ తెలిపారు. గతనెల 11వ తేదీ రాత్రి శివబార్‌లో నిందితులు జాదవ్ శ్రీనివాస్, రాథోడ్ సాయినాథ్‌లు మందుతాగి చెల్లించాల్సిన బిల్లు కంటే తక్కువ చెల్లించి అదనపు మద్యం ఇవ్వమని డిమాండ్ చేశారు. సిబ్బంది ప్రశ్నించడంతో జాదవ్ శ్రీనివాస్ గాజుగ్లాస్ తీసుకుని ఉద్యోగి ముఖంపై విసిరి గాయపరిచాడు. కౌంటర్ వెనక ఉన్న గాజు వస్తువులను సైతం ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడ్డారు.బాధితులఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా... శుక్రవారం జాదవ్ శ్రీనివాస్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టణంలో రాఖీ పండుగ సందడి

● అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక ఈ రాఖీ పండుగ ● స్కూళ్లలో చిన్నారులు ఒకరికొకరు రాఖీ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు


ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా వెలసిన దుకాణాలు


వన్ టౌన్ సీఐకు రాఖీ కడుతున్న చిన్నారులు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులు కిటకిట లాడాయి. పండగను పురస్కరించుకుని మార్కెట్‌లోకి వివిధ రకాల రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పట్టణంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. బంగారు, వెండి రాఖీలతో పాటు.. కార్టూన్ బొమ్మలతో ఉన్న రాఖీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. శనివారం రాఖీ పండగ జరుపుకోనున్న నేపథ్యంలో తమఅన్నదమ్ముల్లకు రాఖీలు కొనుగోలు చేయడానికి మహిళలు, యువతులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, అశోక్ రోడ్, వినాయక్ చౌక్ తదితర ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా దుకాణాలు వెలిసాయి. తమ అన్నదమ్ములకు అందమైన రాఖీలు ఖరీదు చేయడానికి మహిళలు, యువతులు ఆసక్తి చూపగా.. చిన్నారులు తమకు ఇష్టమైన రాఖీలను ఖరీదు చేసుకుని సంబరపడ్డారు. రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించే సంప్రదయం ఉన్న నేపథ్యంలో మిఠాయిల దుకాణాలు సైతం జనాలతో కిక్కిరిసి కనిపించాయి. అన్నదమ్ముళ్ల ఇండ్లకు వెళ్లేందుకు మహిళలు బస్సుల కోసం వేచి చూశారు.

పోలీసులకు రాఖీలు కట్టిన చిన్నారులు

రాఖీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఐరిస్ ఫ్లోరెట్స్ పాఠశాల విద్యార్థులు పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసులు సమాజం కోసం చేస్తున్న సేవలను గుర్తించి చిన్నారులు వారికి రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, స్నేహబంధం, రక్షణ భావాన్ని వ్యక్తపరుస్తూ రాఖీలు కట్టి తమ ఆనందాన్ని పంచుకున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలకు తమ కర్తవ్యాలు, సమాజంలో శాంతి భద్రతల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో దేశ భక్తి, గౌరవభావం పెంపొందించాలనే ఉద్దేశ్యం నెరవేరిందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలంలోని కురుక్షేత్ర పాఠశాల, శ్రీసరస్వతి శిశు మందిర్‌లలో శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా ముందస్తురక్షాబంధన్ వేడుకలను పిల్లలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.పిల్లలుఒకరినొకరు రాఖీకట్టుకొని శుభాకాంక్షలు తెలుపుతు అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. రాఖీ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివరించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సబ్సిడీ నవీన్, డబ్బుల రమణ, మునేశ్వర్ సంపత్ పాల్గొన్నారు.

తలమడుగు: అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతిక జరుపుకునే పండుగ రాఖీ పండుగ శ్రావణమాసంలో వచ్చే పూర్ణిమ రాఖీ పూర్ణిమగా పిలుస్తుంటారు. భారతదేశ సాంస్కృతి సంప్రదాయాల్లో రాఖీపూర్ణిమ పండుగకు ఘనమైన చరిత్ర ఉంది. ఈపండుగకు వృత్తి వృత్తిరీత్యా విదేశాల్లో ఇతర ప్రాంతాలకు ఎక్కడికి వెళ్లినా తన కుటుంబ సభ్యుల్లో అన్నాతమ్ముళ్లకు రాఖీ కట్టడానికి తప్పకుండ వస్తుంటారు. రాఖీకట్టిన తన చెల్లెకు అక్కకు కానుకగా నగదు వస్త్రాలు ఇతర వస్తువులను జ్ఞాపకార్థంగా అందిస్తారు. అంతేకాకుండా కూలమాత విభేదాలకు తావియకుండా సోదర భావంతో ఈ పండుగను నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయం. అదేవిధంగాపండుగకు ముందు రోజుగా మండలంలోని సోదరి తన సోదరుడికి రాఖీకట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జాదవ్ మహేందర్

నేరడిగొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే మార్గం ఎన్‌హెచ్ 44 సర్వీస్ రోడ్డుపై చెట్ల కొమ్మలను లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆ మార్గమంలో బస్సులు వెళ్లడానికి చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో ఆయన స్పందించారు. దారి క్లియర్ చేసిన విషయాన్ని ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో ఆ మార్గంలో బస్సులు నడుపుతామని వారు తెలిపారు. వీరి వెంట సోలంకి కరణ్ సింగ్, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ ఉన్నారు.

రైతుసేవా సహకార సంఘం ఫంక్షన్ హోల్ ప్రారంభం

నిర్మల్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రైతుసేవాసహకార సంఘం నూతనఫంక్షన్ హాల్‌ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, డైరెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్, బీజేపీ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రై డేలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలి

ఖానాపూర్,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోత):ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఖానాపూర్ మండల ప్రత్యేక అధికారి జీవరత్నం కోరారు.ఈమేరకు మండలంలోని పాత ఎల్లాపూర్, గోడలపంపు,గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఆయన వెంటఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

వైభవంగా వరలక్ష్మీ పూజలు


ముథోల్ శిశు మందిర్‌లో వరలక్ష్మి వ్రతం

దిలావర్‌పూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరాల తల్లి వరలక్ష్మి పూజలను మండలంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున కల్లాపిచల్లి, ఇంటిని శుభ్రం చేశారు. ఇంటి ముంగిట ముగ్గులు వేశారు. ఇంట్లో అమ్మవారి కలశాన్ని ఏర్పరిచారు.

కడెం: మండల కేంద్రంలో మహిళలు ఘనంగా వరలక్ష్మి వత్రంలో పాల్గొన్నారు. తెల్లవారు జామున మహిళలు ఆలయాలకు వెళ్లి సామూహికంగా వరలక్ష్మి వత్రాల్లో పాల్గొని, పండ్లు నైవేద్యంగా పెట్టి హారతి ఇచ్చారు. మరోవైపు పూలకు డిమాండ్ విపరీతంగా పెరిగిందని తెలిపారు.

భైంసా: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు వైభవోపేతంగా జరిగాయి. శ్రావణమాసంలో బాగంగా స్థానిక లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం, గోపాల్ కృష్ణ మందిర్, శిశు మందిర్ పాఠశాలల్లోవరలక్ష్మీ పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక శిశుమందిర్ విద్యాసంస్థల్లో వరలక్ష్మీ అమ్మవారి చిత్రపటాన్ని అలంకరించి వ్రతపూజలను చేపట్టారు.

ముథోల్: ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల తహసీల్ రోడ్డు, కొలిగల్లీ పాఠశాలలో వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత సేవా సంయోజక్ గౌరీగారి గంగారెడ్డి, పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, పాఠశాల ఉపాధ్యక్షులు రోళ్ల రమేష్, ప్రధానాచార్యులు సారథి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, హితైషులు, ఆచార్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్: పట్టణంలో శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూలు, పండ్లకు డిమాండ్ ఏర్పడింది. శ్రావణ శుక్రవారం అందులోను వరలక్ష్మి వ్రతం కావడంతో ఇళ్లలో మహిళలు ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇదే పండుగ పూట అటు వ్యాపారులు పూలు, పండ్ల ధరలను అమాంతంగా పెంచేశారు.

అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

ఇంద్రవెల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండల డాక్టర్ బీఆర్. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సోన్ కాంబ్లే జితేంధర్, ప్రధాన కార్యదర్శిగా కాంబ్లే మారుతి, ఉపాధ్యక్షుడిగా సావంత్ రాజవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా గాయక్ వాడ్ మాధవ్, కోశాధికారిగా కాంబ్లే ఉత్తంలను ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని దళిత సంఘాల ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ సభ్యులు సావంత్ లహుదాస్, పవార్ శాంతి కుమార్, వాగ్మారే కైలాష్, ఆచార్య దత్త, నాయకులు పరత్ వాగ్ సందీప్, సూర్యవంశీ ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు సోయం బాపూరావు నివాళ్లు

ఇంద్రవెల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపూరావు ఇంద్రవెల్లి గిరిజన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ప్రథమంగా ఇంద్రవెల్లి మండల పర్యటనకు శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా మండల ఆదివాసీ నాయకులు మెస్రం నాగ్‌నాథ్ కినక తుల్సిరామ్‌లతో పాటు యువకులు సోయం బాపూరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా నాయకుడు సెడ్మకి ఆనంద్‌రావుతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.


పల్సిలో రక్షాబంధన వేడుకల్లో విద్యార్థులు


మొక్క నాటి రాఖీ కడుతున్న దృశ్యం

జిల్లా అంతటా రాఖీ సందడి

కడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల కేంద్రంలో రాఖీ సందడి మొదలైంది. అక్క చెల్లెళ్లు తమ అన్నదమ్ముళ్ల కోసం కడెంలో రాఖీలు విక్రయించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు రాఖీలు కొనడానికి కడెం మండల కేంద్రానికి వచ్చారు. రాఖీ విక్రయించే కేంద్రాలలో పండుగ వాతావరణం కనిపించింది.

భైంసా: పట్టణంలోని శ్రీ గౌతమీ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులకు విద్యార్థినీలు రాఖీలు కట్టి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సౌదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలను చాటుకునే రీతిలో కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాఠశాల సమీపంలోని వృక్షాలకు రాఖీలు కట్టారు. ఇందులో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రవి రాఖీ పర్వదిన విశిష్టతను వివరించారు.


కుంటాల: మండల కేంద్రం కుంటాల స్థానిక సృజనా విద్యానిలయంలో శుక్రవారం రోజు ముందస్తు రాఖీ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కా,చెల్లెల్లు అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ అనుభూతిని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలోని విద్యాభారతి పాఠశాలలో రక్షాబంధన్ ఉత్సవాలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పురంశెట్టి లింగయ్య మాట్లాడుతూ... రక్షాబంధనము సోదరీసోదరుల ప్రేమను వెల్లువిరుస్తుందని అన్నారు. మన సందప్రదాయంలో ప్రతి శభకార్యంలో కూడా మనం ధారణ చేసే కంకణం ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని చేరుకోవడం కంకణ బద్ధులై ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఒకరికొక్కరు రక్ష కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతన్న, కరస్పాండెంట్ గంగాసింగ్, ఉపాధ్యాంఖయులలు గౌర, సాయినాథ్, కొట్టే రాజు, ప్రవీణ్, భోజన్న, దేవకి, సరస్వతి, శృతిక సరోజన, నేహ పద్మ, రుచిత, అంజలి, శ్రీవిద్య, గంగామణి, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని రబింద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రకృతిని కూడా కాపాడాలనే సందేశాన్ని అందిస్తూ వినూత్న రీతిలో చెట్లకు రాఖీలు కట్టారు. మానవుల్లో అన్నకు చెల్లి కట్టే రాఖీ ఉద్దేశ్యం తనకు జీవితాంతం రక్షణగా ఉండాలని అర్థం. అదే ఆధారంగా చేసుకొని చెట్లకు రాఖీ కట్టి వాటికి మనం ఆధారంగా ఉండాలని సందేశాన్ని అందించారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం లాగా చెట్లతో మనకు విడదీయలేని బంధం ఉందని మనమే రాఖీ కట్టి మనం చెట్లకు రక్షిస్తే అవి మనకు రక్షిస్తాయని తెలియజేశారు. చెట్లు పర్యావరణాన్ని కాపాడుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ భీమ్ రావు దేశ్‌ముఖ్, డైరెక్టర్ పోతన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్: పట్టణంలో వాసవి పాఠశాలలో శుక్రవారం రాఖీ పండుగ వేడుకలను ముందస్తుగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జగదీష్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: పట్టణంలోని బాలాజీ వాడలో గల అలివేలు మంగ దేవాలయంలో శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకొని రక్షాబంధన్ కరపత్రాలను అందజేసినట్లు అరుణ్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రతి గుడి లో కరపత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఒక్కరూ గాయ త్రి మంత్రాన్ని 11సార్లు పఠించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకోట మాజీ చైర్మన్ ఆమెడ శ్రీదర్, గంధం సుధాకర్, పతికే రమేష్, రాజులదేవి రాజశేఖర్, రవి, అరుణ్ శర్మ, పాల్గొన్నారు.


రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు

అనుమానాస్పద ఫైల్‌తో సైబర్ మోసం

● లక్షా పద్నాలుగు వేలు మాయం

నర్సాపూర్(జి), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక సైబర్ మోసం కేసు నమోదైంది. గొల్లమాడ గ్రామానికి చెందిన ఒక కూలీ తన వాట్సాప్‌లో వచ్చిన 'పీఎం కిసాన్' అనే పేరుతో ఉన్న అనుమానాస్పద ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఓపెన్ చేయగా, అతని బ్యాంక్ ఖాతా నుండి రూ.1,14,400 మాయమయ్యాయి. డిసెంబరు 6, 2024న జరిగిన ఈ ఘటనలో ఆ వ్యక్తి ఆ ఫైల్ ఓపెన్ చేయగానే అతని ఫోన్‌సిగ్నల్స్ ఆగిపోయాయి.మరుసగటి రోజు డిసెంబరు 7న అతను గొల్లమాడలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో తన ఖాతాను తనిఖీ చేసుకోగా ఆడబ్బు రమేష్ అనే వ్యక్తికి బదిలీ అయినట్లు గుర్తించాడు.

● గోల్డెన్ అవర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దిలీప్ సహాయం

ఆ వ్యక్తి బ్యాంక్‌కు వెళ్లగానే తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దిలీప్ 'గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేసి ఆ డబ్బులు ఫ్రీజ్ చేయించడంలో సహాయం చేశారు. ఈ సహాయానికి మేనేజర్‌ను బాధితుడు అభినందించాడు. వెంటనే బాధితుడు 1930కు కాల్ చేసి ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు తర్వాత అతను డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో పోలీసులను సంప్రదించడంలో జాప్యం జరిగినట్లు తెలిపాడు. ఈ ఘటనపై నర్సాపూర్ పోలీసులు 126/2025 నెంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఎస్సై గణేష్ దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు ప్రజలను సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

నిగ్వా ముంపు బాధితులకు
ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి

● ముథోల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు బారిన పడ్డ కుభీర్ మండలంలోని నిగ్వా గ్రామబాధితులకు ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మింప చేసి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండదండగా నిలబడుతామని ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు.శుక్రవారం నిగ్వా గ్రామానికి చెందిన ముంపు బాధితులు భైంసాకు తరలివచ్చి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి తమ గోడు వెల్లబోసుకున్నా రు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కుభీర్ మండల కాంగ్రెస్ ప్రతినిధులు బషీర్, బంక బాబు,జాడేశ్రీనివాస్, శివాజీ,పలువురు పాల్గొన్నారు.

అలుపెరగని.. పోరాటాలు

(5వ పేజీ తరువాయి...)

మారింది. దీంతో ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో లేకపోవడంతో ఆదివాసీలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

వర్షాకాలమంటే వణుకే..

ఏజెన్సీ మారుమూల గ్రామాలకు వర్షాకాలమంటేనే వణుకు పుట్టిస్తుంది. ఇప్పటికీ జిల్లాలో ఎన్నో మారుమూల గ్రామాలకు కనీస రోడ్డు, రవాణా సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు మరి. వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంకలను దాటుతూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన ప్రాణాలు పోయిన దాఖలాలు ఉన్నాయి. యేళ్ల తరబడి రోడ్డు, మంచినీటి సౌకర్యం, ఇతర వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఉట్నూర్ ఐటీడీఏ ముందు ఆందోళనలు, నిరసనలు చేపడుతున్న అధికారులు పట్టించుకోవడమే లేదంటున్నారు. ఇప్పటికి కనీస రోడ్డు, రవాణా సౌకర్యం లేక పోవడంతో అత్యవసర సమయంలో దేవుడెదిక్కన్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. అత్యవసర సమయంలో వైద్యం అందక యేటా ఎందరో మంది ఆదివాసీల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.ఇప్పటికి అత్యవసర సమయంలో ఎడ్లబండ్ల పైననే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు ప్రసవ వేదనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తెగల మధ్య ఆధిపత్య పోరు

గత కొంత కాలంగా ఆదివాసీ తెగల మధ్య ఆదిపత్య పోరు కనిపిస్తుంది. ఇన్నాళ్లు తుడందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీల సమస్యల కోసం ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఇటీవల రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎంపీ సోయం బాపురావు బాధ్యతలు చేపట్టడంతో జిల్లాలో పరిస్థితులు మారిపోతున్నాయి. ఆదివాసీల సమస్యల కోసం ఐక్యంగా ఉండి పోరాడాల్సిన ఆదివాసీ నేతలే ఒకరి పై ఒకరు బహిరంగా విమర్శలు చేసుకోవడం కనిపిస్తుంది. ప్రస్తుతం తుడందెబ్బ వర్సెస్ రాజ్‌గోండ్ సేవా సమితి అన్నట్లుగా మారిపోయింది. పోటాపోటీగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదిపత్యం కోసం నేతలు ఆరాటా పడుతున్నట్లు కనిపిస్తుంది.ఇకనైనా కలిసి పోరాటాలు చేస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి ఆదివాసీల సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

జాతీయ నులి పురుగుల నిర్మూలన
దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జాతీయ నులి పురుగుల నిర్మూల దినోత్సవం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆ రోజు నుంచి 18వ తేదీ వరకు నులి పురుగుల నిర్మూలన కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి నయనా రెడ్డి, వైద్యశాఖ అధికారులు సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

● ఎమ్మెల్యే కోవ లక్ష్మీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

దిలావర్‌పూర్,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొమురం భీమ్ ఆసిఫాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జిశ్యామ్ నాయక్‌కు ఎమ్మెల్యే కోవలక్ష్మీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని లంబాడా హక్కుల పోరాట సమితి అశోక్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే కోవల లక్ష్మీపై ఫిర్యాదు చేశారు. ఒక ఎమ్మెల్యే అయి ఉండి కూడా సహనం కోల్పోయి శ్యామ్ నాయక్ పైకి వాటర్ బాటిళ్లు విసరడం శోచనీయమన్నారు. కనీస ఇంగితజ్ఞానం లేకుండా శ్యామ్ నాయక్‌ను అవమానించిన కోవ లక్ష్మీపై పరువు నష్టం దావా వేయనున్నట్లు చెప్పారు. కోవ లక్ష్మీ ఎమ్మెల్యే స్థాయిని దిగజార్చారన్నారు. శ్యామ్ నాయక్‌కు క్షమాపణలు చెప్పే వరకు ఎమ్మెల్యే కోవ లక్ష్మీని లంబాడా తండాల్లోకి రానియొద్దని పిలుపునిచ్చారు. అనుచితంగా ప్రవర్తిస్తూ శ్యామ్ నాయక్‌ను అవమానించిన కోవలక్ష్మీపై కేసు నమోదు చేయాలని ఆయన పోలీసులను కోరాడు.

ఫుట్ పాత్‌పై వ్యాపారాలు చేసిన వారికి జరిమానా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ప్రధాన కూడళ్లలో పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్ పాత్‌పై వ్యాపారాలు చేయొద్దని పుర అధికారులు స్పష్టం చేశారు. స్థానిక గాంధీ చౌక్‌లో ఫుట్ పాత్‌పై వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి సదరు దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. పాదచారులు నడిచేందుకు మాత్రమే వాటిని వినియోగించాలని, దుకానాలు నిర్వహిస్తే తగు చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నారు. ఇందులో పుర అధికారులు, సిబ్బంది సాయి కృష్ణ, నర్సింలు, రాజేశ్వర్, వినయ్, రాజు, క్రాంతి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ. 7500 పెంచేలా చర్యలు చేపట్టాలి

భైంసా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రావిడెంట్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ. 1000 నుంచి రూ. 7500కు పెంపుదల చేపట్టాలని పింఛన్‌దారుల సంఘం భైంసా డివిజన్ ప్రతినిధి జాదవ్ పుండలిక్‌రావ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విషయంలో రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులతో కలిసి ప్రదర్శనలు చేపట్టారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, మార్కెట్‌లోని పరిస్థితులతో కనీస పెన్షన్ రూ. వెయ్యితో పింఛన్‌దారులు జీవించడం దుర్లభంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్‌దారుల ఆర్థిక పరిస్థితులు, వయోభార స్థితిగతులను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ పెన్షన్‌ను రూ. 7500కు పెంపుదల చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో సభ్యులు జనార్ధన్‌రెడ్డి, వినాయక్‌రావు, సాయినాథ్, సాయినాథ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు చేపట్టాలి

భైంసా, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తమ కూతురి పట్ల కక్ష్యపూరిత దోరణి విధానాలతో వ్యవహరిస్తున్న భైంసాలోని వాసవి హైస్కూల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాల చదువుతున్న విద్యార్థిని తండ్రి శ్రీనివాస్ మండల విద్యాధికారి సుభాష్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం బంధు, మిత్రులతో కలిసి వెళ్లి మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోకు లిఖితపూర్వంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న తన కూతురిని పాఠశాల నిర్వాహకులు, బోధించే ఉపాధ్యాయులు అకారణంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత విషయంలో ఎంఈవో సుబాష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విద్యార్థిని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువులను గోశాలకు తరలించండి

● రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలకు బజరంగ్ దళ్ విన్నపం

ఖానాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను గోశాలకు తరలించాలని కోరుతూ బజరంగ్ దళ్ ఖానాపూర్ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ నాయకులు సందీప్, భూమేష్, సాయి, ప్రణీత్, ప్రతాప్, తదితరులున్నారు.

ప్రసూతి ఆసుపత్రిలో ఉయ్యాల కార్యక్రమం

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రసూతి ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాల కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీవో డాక్టర్ సౌమ్య, డాక్టర్ నిఖిత సుధీర్, సృజన్, ప్రేమ్, మాస్ మీడియా అధికారి బారె రవీందర్, నర్సింగ్ ఆఫీసర్ ప్రభాకర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు

నిర్మల్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొండా శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, జమాల్, నరికెల గంగన్న, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నాయకులు పి. నర్సారెడ్డి, నర్సారెడ్డి, భూపతి రెడ్డి, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ నగేష్‌తో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

ఎంపీని కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

బోథ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య శుక్రవారం ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్‌ను కలవడం జరిగింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారి ఎంపీని కలవడంతో ఎంపీ జిల్లాలో గ్రంథాలయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు చైర్మన్ వివరించారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



కౌటాబిలోని శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బోథ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా (బి) శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవిని పూజిస్తూ మహిళలు మూకుమ్మడిగా కార్యక్రమం గావించారు.

అపురూపం.. ఆదివాసీల సంస్కృతి

▸▸ నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



సాంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ఆదివాసీలు



కిక్రి వాయిద్యంతో గిరిజన గూడెంలో కథలు చెబుతున్న తోటి గిరిజనులు

ఉట్నూర్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సాంప్రదాయాల రక్షణలో దిట్టలు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు తమ ఆచార, సాంస్కృతి సాంప్రదాయాల రక్షణకు కట్టుబడి జీవిస్తున్నారు. తరాలు మారుతున్న సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించి రక్షించుకుంటామని ఆదివాసీ గిరిజనులు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే అడవి తల్లికి పూజలు చేసి అడవికి వచ్చే గిరిజనులను, పశువులను క్రూర మృగాల నుంచి కాపాడాలని కోరుతూ సామూహిక పూజలు నిర్వహిస్తారు. దసరా పండుగను నిర్వహించుకుంటున్న గిరిజనులు దీపావళి దండారి సంబరాలనుగ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకుంటారు. గ్రామాలలో పటేల్ వ్యవస్థతో పాటు కటోడా వ్యవస్థకు కట్టుబడి జీవిస్తున్నారు. సంస్కృతి సాంప్రదాయాల రక్షణలో ఆట పాటలకు అధిక విలువిస్తారు.



ఆదివాసీ గిరిజన వృద్ధురాలు



ఆదివాసీ కోలాం గిరిజన మహిళ



అడవుల్లో సేకరించిన మొర్రిపండ్లు విక్రయిస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

మొర్రిపేట్‌లో కోలాం గిరిజనుల ఇళ్లు





కర్రలతో నడిపించే కొడంగల్ సంప్రదాయం

ఏళ్లుగా వస్తున్న ఆచారం

▸▸ తరాలు మారినా తరగని మణిహారం

తరతరాలుగా వస్తున్న ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం సైతం పాటిస్తూ వాటి ప్రాధాన్యతను చాటి చెబుతోంది. మారుమూల ఆదివాసీ గూడాల్లో నేటికీ అనాధిగా వస్తున్న ఆచారాలను పాటిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. ప్రతీయేటా శ్రావణ మాసంలో పిల్లలను కర్రలతో నడిపించే కోడంగల్ సంప్రదాయాన్ని పాటిస్తుండడంతో గ్రామాల్లో చిన్నారులు సందడిగా గడుపుతూ కనిపిస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ఆదివాసి సంస్కృతీ వైభవాన్ని ఆ దృశ్యాలు గుర్తు చేస్తున్నాయి. ● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం

▸▸ తలమడుగు మండల అధ్యక్షుడు నక్క ధనుంజయ్



కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

తలమడుగు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వికాసం బీజేపీ తోని సాధ్యమని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నక్క ధనుంజయ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ధనంజయ్ మాట్లాడుతూ గ్రామీణ వికాసం బీజెపి తోనే సాధ్యం అనే కార్యక్రమంలో భాగంగా బీజేపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమలను ప్రతి ఇంటికి తెలియపరిచే విధంగా, అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు నేరవేర్చలేదని తెలియజేస్తూ గ్రామంలోని ప్రతి ఒక్కరికి కరపత్రాలను అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షులు నక్కా ధనుంజయ్, బిజెపి మండల ఉపాధ్యక్షులు ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ యువ మోర్చా తలమడుగు మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, బోనగిరి స్వామి, ముత్యాల దేవ న్న, లక్ష్మణ్, భుజంగ్ రావు, రామ్ రెడ్డి, నాగన్న, చక్రపాణి, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండాను ఎగురవేయాలి



సోనాలలో మాట్లాడుతున్న జిల్లా ప్రభారి

బోథ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న 15వ ఆగస్టు నాడు ప్రతి ఇంటి పైన త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా ప్రభారి జీవి రమణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని నింపాలని వారితో కలిసి జాతీయ భవాని పెంపొందే విధంగా చూడాలన్నారు.

సోనాల బస్టాండ్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ప్రధాన రహదారి బురదమయం కావడంతో నడిచేందుకు వీలు లేకుండా పోయింది. అయితే ఈ రోడ్డుపై నడవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. అయితే ఇటీవల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ముఖ్యమంత్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి, వెంకటరెడ్డి కృషి వల్ల నిధులు మంజూరయ్యాయని అయితే మంత్రికి సన్నిహితంగా ఉండే తమ గ్రామానికి చెందిన తుల అరుణ్ కుమార్ కృషి ఎంతగానో ఉందని వారు పేర్కొన్నారు. నిధుల మంజూరుకి కృషి చేసిన నియోజకవర్గ ఇంచార్జికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సహకార సంఘం డైరెక్టర్ లోలపు పోశెట్టి తదితరులు ఉన్నారు.



సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మురికి కాలువలను శుభ్రం చేసిన సిబ్బంది



పొచ్చెరలో మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్న గ్రామ కార్యదర్శి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోథ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచ్చేర గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు అన్న వార్తకు గ్రామపంచాయతీ కార్యదర్శి డి చిన్న గంగయ్య స్పందించారు. మురికి కాలువ లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై నుండి ప్రవహించడంతో రోడ్డు పక్కన చిన్న కాలువను తవ్వించడం జరిగింది. దీంతో మురికి నీరు మురికి కాలువల నుండి వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో మురికి నీరు రోడ్డుపై రాకుండా కాలువ ద్వారా బయటకు వెళ్ళిపోతుంది. అయితే గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడంతో నిధులు రాగానే మురికి కాల్వలను నిర్మిస్తామని పేర్కొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం ముందు నిరసన

నిర్మల్ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా కమిటీ సభ్యులు పసివుద్దీన్, తొడసం శంభు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీహార్ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అణిచి వేసే కుట్రలో బీజేపీ నేరుగా పాలుపంచుకుంటుందని, మైనార్టీలను, ఎస్సీలను ఇతర ప్రతిపక్ష అనుకూల ఓటర్లను లక్ష్యంగా చేసుకొని దాదాపు 64 లక్షల ఓట్లు తొగించడంపై ఆరోపణలు వచ్చాయన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నిర్లక్ష్యపు శిశువులకు అండగా ఊయల

▸▸ డీఎంఅండ్‌హెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ సురేష్



ఏరియా ఆస్పత్రిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజేందర్

భైంసా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువును వద్దు అనుకునే వారు నిర్లక్ష్యంగా వారిని వదిలిపెట్టకుండా శిశువుల సంరక్షణ కోసం ఆస్పత్రులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఊయల కేంద్రాలలో వదిలిపెట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.రాజేందర్, డీసీహెచ్ డా.సురేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో శిశువుల స్వీకరణ కేంద్రం ఊయలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువులను వద్దనుకునే వారు వారిని చెత్త కుప్పలు, మురికి కాలువలు, రోడ్లపై వదిలిపెట్టవద్దని సూచించారు. వారి సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయల కేంద్రాల్లో శిశువులను వదిలిపెట్టాలని సూచించారు. శిశువులు అనారోగ్యం తో ఉన్న వారికి అవసరమైన వైద్యం అందించి శిశు గృహాలకు తరలిం చి సంరక్షణ చర్యలు చేపడుతారని వివరించారు. ఆసుపత్రులలో ఏర్పాటు చే స్తున్న ఊయల కేంద్రాల వద్ద ఎలాంటి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండద ని, ఊయలలో వేసిన వారిపై నిఘా, విచారణ లాంటి చర్యలేవి ఉండవని పేర్కొన్నారు. వివరాలు వెల్లడించినప్పటికీ వాటిని గోప్యంగా ఉంచబడుతాయన్నారు. శిశువులను రోడ్లు, మురికి కాలువలు, చెత్త కుప్పల్లో వదిలివేయడం మూలంగా వారు మరణించే అవకాశముందన్నారు. ఊయల కేంద్రంలో వదిలితే వారు సంరక్షించబడుతారని పేర్కొన్నారు. ఎంతో మం ది పిల్లలు లేని దంపతులు దత్తత కోసం ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వదిలివేసిన శిశువులను చట్ట ప్రకారం దత్తత ఇచ్చేందుకు అవకాశముందన్నారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కాశీనాథ్, వైద్యాధికారులు డా. బోస్లే పద్మావతి, డా. అపూర్వ పాల్గొన్నారు.

సైబర్ మోసంతో రైతు ఖాతా నుంచి రూ.1,37,300 మాయం

▸▸ పోలీసులకు ఫిర్యాదు

ముథోల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని ముథోల్ పోలీస్ స్టేషన్‌లో సైబర్ మోసానికి సంబంధించి ఒక ఫిర్యాదు నమోదైంది. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన సిధారి హనుమంత్ రెడ్డి అనే రైతు తన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 1,37,300లు అనధికారికంగా బదిలీ అయ్యాయని ఫిర్యాదు చేశారు. జూలై 9, 2024న మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతను 'పీఎం కిసాన్'కు సంబంధించిన ఒక వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయగా ఈ మోసం జరిగింది. మరుసటి రోజు అతని ఫోన్ పే ద్వారా తొమ్మిది లావాదేవీల ద్వారా డబ్బులు విత్‌డ్రా అయినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ దర్యాప్తు చేస్తున్నారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



వరలక్ష్మీకి పూజలు చేస్తున్న మహిళలు



కప్పర్లలో వరలక్ష్మీ పూజలో పాల్గొన్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

▸▸ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో వచ్చే విశేషమైన పండగలతో జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్రసిద్ధ ఆలయాలు, పలు పాటశాలల్లో సాముహిక వ్రతాలను ఆచరించి అమ్మవారిని వేడుకున్నారు. స్థానిక శ్రీ గోపాల చంద్ర కృష్ణ మటంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి ప్రపత్తుల నడుమ నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన మహిళలు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిపారు. కలెక్టర్ రాజర్షి షా కార్యక్రమ ముఖ్య అతిథిగా పాల్గొని పాల్గొని... ప్రత్యేక పూజలతో అమ్మవారిని ఆరాధించారు. వరలక్ష్మీ అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఆచారించారు. పట్టణానికి చెందిన మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కార్యక్రమంలో ఆర్‌డీఓ స్రవంతి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కొరెడ్డి పార్థ సారథి, సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షులు బండారి వామన్, కోశాధికారి సూర్య కాంత్, ఉపాధ్యక్షులు రేణుకుంట రవీందర్, లోలపు శ్రీనివాస్, కందుల రవీందర్ పాల్గొన్నారు. పండగల విశిష్టతను తెలియచెప్పేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం పట్ల కలెక్టర్ రాజర్షి షా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాటశాలలో సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి ప్రపత్తుల నడుమ జరిపారు. ముందుగా ప్రార్థన నిర్వహించిన అనంతరం పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రావణ మాసంలో విశేషంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రత విశిష్టతను వేద పండితులు భక్తులకు తెలియజేశారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ దేవిని పూజిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఈ సందర్భంగా పలువురు మహిళలు తెలిపారు.

తాంసి: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన తాంసితో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కప్పర్ల, పొన్నారి, హసనాపూర్, తాంసి, వడ్డాడి గ్రామాల్లోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతా న్ని నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, పూజా సామాగ్రితో వచ్చి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఇంటిల్లి పాదులు ఆరోగ్యంగా ఉంటూ అష్టైశ్వర్యాలు ప్రసాదించాలంటూ లక్ష్మీదేవిని వేడుకున్నారు.

నేరడిగొండ: మండలంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా శ్రీవాణి, తెలంగాణ మహిళా సమితి మాతృ కో కన్వీనర్ వక్తగా పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారి ఆలయాలకు చేరుకొని వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వారివారి స్వగృహాల్లో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసుకొని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భైహర్ గణేష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలం కేంద్రంతో పాటు లక్కారం, గంగన్నపేట, షాంపూర్, ఏందా, ఉమ్రి, సాలెవాడా, కుమ్మరి తండా, పులిమడుగు తదితర గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ పూజలను ఇంటింటా ఘనంగా నిర్వహించుకున్నారు. పరాశక్తిని శ్రావణ మాసంలో శ్రీ మహాలక్ష్మిగా ఆరాధించడానికి మహిళలు వరలక్ష్మీ దేవిగా పూజిస్తారు. వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ద్వారా అనుకూలమైన పరిస్థితులు ఉంటాయని, సకల సంపదలు వస్తాయని నమ్మకం.



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

బజార్‌హత్నూర్: మండలంలోని సరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతంపూజలు ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వేదపంతుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి ఇస్తారి పాల్గొని వరలక్ష్మీ వ్రతం గొప్పతనం వివరించారు. ఈ కార్యక్రమంలో వంద మంది మాతలు పాల్గొని సామూహికంగా వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కాటిపెల్లి నారాయణ రెడ్డి, సమితి అధ్యక్షుడు చట్ల ఉత్తం, పాఠశాల ప్రబంధ కారిణి సభ్యులు కొత్త శంకర్, పోలోజు రాజన్న, ప్రధానాచార్యులు పోర్ని వెంకట రమణ, ఆచార్య బృందం పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

బోథ్: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు మహిళా భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో మహిళలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. సరస్వతీ శిశు మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు అరవింద్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు: శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారన్ని వరలక్ష్మి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా దేవాలయాల్లో గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఘనంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.



నేరడిగొండలో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు



తలమడుగులో..

విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు

సోన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలన్న ఉద్దేశంతో అధికారులు బ్యాంక్ ఖాతాలు తెరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో 350 బ్యాంకు ఖాతాలు తెరిచి, విద్యార్థినులకు అందివ్వడం జరిగింది. ఇది వరకే సారంగాపూర్ మండలంలో ఎస్‌బీఐ, టీజీబీ బ్యాంకుల సహకారంతో 500 ఖాతాలు తెరిపించినట్లు చెప్పారు.

ఫటాఫట్

చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

● డాక్టర్ దయానంద్ రెడ్డి,
చిన్న పిల్లల వైద్య నిపుణుడు, ఏరియా ఆస్పత్రి, భైంసా



ప్రశ్న: ప్రస్తుత సీజన్‌లో పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి చర్యలు పాటించాలి.?.

జవాబు: వానకాలంలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి. కాచి... చల్లార్చి వడ పోసిన నీటిని మాత్రమే తాగాలి. వేడి ఆహార పదార్థాలు తీసుకోవం ప్రయోజనకరం. శీతల పానీయాల జోలికి వెల్లకపోవడం శ్రేయస్కరం

ప్ర: వానకాలంలో ఎలాంటి వ్యాధుల బెడద ఉంటుంది.?.

జ: ప్రస్తుత సీజన్‌లో పిల్లలకు జ్వరాలతో పాటు జలుబు, అస్తమా, శ్వాసకోశ వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. వాతవరణంలోని మార్పులతో పాటు దోమలు కుట్టడం, కలుషిత నీటిని తాగడం తదితర కారణాల మూలంగా వ్యాధుల బారిన పడుతారు

ప్ర: పాఠశాలల్లో అంటు వ్యాధుల బెడద నివారణకు సూచనలేంటి.?.

జ: వ్యాధుల సీజన్ నెలకొని ఉన్న దృష్ట్యా పిల్లలకు ఆరోగ్య రక్షణకు చర్యలపై తల్లితండ్రులు జాగ్రత్త పరచాలి. శుచి,శుభ్రత పాటించేలా విద్యార్థులను చైతన్యపరచాలి. చర్మ సంబంధిత వ్యాధులతో సతమతమయ్యే విద్యార్థులు వ్యాధి తీవ్రత ఉన్న సమయంలో ఇళ్లలోనే ఉండి చికిత్స పొందాలి. కండ్ల కలక బారిన పడ్డ విద్యార్థులు ఇతరులకు వ్యాధి వ్యాప్తి కలుగకుండా ఉండేందుకు కంటి అద్దాలను వినియోగించాలి.

ప్ర: విద్యార్థులు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్త చర్యలు ఏంటి. ?.

జ: ప్రతీ విద్యార్థి శుచి,శుభ్రత పాటించాలి. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుగుకోవాలి. శుభ్రంగానున్న మూత్రశాలలు, మరుగుదొడ్లను వినియోగించాలి. రెండింటికి వెళ్లినపుడు సబ్బుతో చేతులను శుభ్రంగా కడుగుకోవాలి. తడిసిన దుస్తులను ధరించవద్దు. ఎక్కడ పడితే అక్కడి తినుబండరాలు తినకూడదు.

- భైంసా, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి)

విధి నిర్వహణలో భాగంగా..

నిత్యం హాజరు విధానంలో పాదర్శకత పాటించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానానికి నిర్మల్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు పాతర వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కాకపోవడంతో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారుల హాజరు విధానంలో పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది.




నకిలీ హాజరు...!

- ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని అపహాస్యం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- ఇంటి వద్దనే ఉంటూ కామాటీలతో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు
- ఇదివరకే జిల్లాలో ఐదుగురు సస్పెన్షన్
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం
- మరో 82 మంది కార్యదర్శులకు షోకాజ్‌ల జారీ
- జవాబు ఇవ్వగానే కఠిన చర్యలు తీసుకునేందుకు సన్నద్ధం
- కడెం మండలం చిన్న బెల్లాల్‌లో తానే ఫొటో అప్లోడ్ చేసే వాడినని వెల్లడించిన కామాటి

నిర్మల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం ప్రవేశపెట్టిన ఈ ముఖ హాజరు (ఫేషియల్ రికగ్నసింగ్ సిస్టం) విధానాన్ని జిల్లాలో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు అపహాస్యం చేస్తున్నారు. ఇటీవల ఈ విధానాన్ని అపహాస్యం చేసిన ఐదుగురు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేసినప్పటికీ మరో 82 మంది ఫేక్ అటెండెన్స్‌ను ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేస్తూ అధికారులకు చిక్కారు. వీరికి జిల్లా కలెక్టర్ మంగళవారం షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

ఇంటి వద్దనే ఉంటూ హాజరు

జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇంటి వద్దనే ఉంటూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో కామాటీలతో హాజరు వేయించుకుంటున్నట్లు తేలింది. కడెం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సుధాకర్ విధులకు సరిగా హాజరు కావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఆయన ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు ఎలా వేసుకుంటున్నారని 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కామాటీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నట్లు నేరుగా ఒప్పుకున్నారు. తనపై అధికారి అయినందున ఆయన చెప్పినట్లుగా చేశానని శ్రీనివాస్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. కాగా ఈ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా మండల పంచాయతీ అధికారి కవిరాజు ఉండడం ఇక్కడ మరో విశేషం. మండలంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరును పర్యవేక్షించాల్సిన ఎంపీవోనే ప్రత్యేక అధికారిగా ఉన్న గ్రామ పంచాయతీలోనే ఇలా జరగడంతో జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఏ విధంగా ఉందో తేలిపోతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీవో ప్రత్యేక అధికారిగా ఉన్న ఈ గ్రామానికి పంచాయతీ కార్యదర్శి సరిగా రాకపోవడంతో కామాటీగా పని చేస్తున్న శ్రీనివాసే ఆ గ్రామానికి అనధికార పంచాయతీ కార్యదర్శిగా మారాడని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీలో ఏ పనులు జరగాలన్న తానే ఖర్చు పెట్టి చేస్తున్నానని తనకు గ్రామ పంచాయతీ నుంచి రూ.40 వేల వరకు రావాలని శ్రీనివాస్ తెలపడం కొసమెరుపు.


గత నెలలో చిన్నబెల్లాల్ పంచాయతీ కార్యదర్శి సుధాకర్ అప్లోడ్ చేసిన ఫేక్ అటెండెన్స్ వివరాలు(ఫైల్)

మరో 82 మందికి షోకాజ్

జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శ లు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికారులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదివరకే ఫేక్ అటెండెన్స్ నమోదు చేసిన జిల్లాలోని నిర్మల్ మండలంలోని లంగ్డాపూర్, సోన్ మండలంలోని జాఫ్రాపూర్, సాకెర, లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి, కడెం మండలంలోని కొర్రతండా గ్రామాలకు చెందిన ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను గత శనివారం జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కాగా తాజాగా మరో 82 మంది ఫేక్ అటెండెన్స్ నమోదు చేసినట్లు తేలడంతో వారందరికీ మంగళవారం జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వారం రోజుల్లో చర్యలు

ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని అపహాస్యం చేసేలా ఫేక్ అటెండెన్స్‌ను అప్లోడ్ చేసిన జిల్లాలోని 82 మంది పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికార యంత్రం సిద్దమవుతున్నట్లు తెలిసింది. ఇదివరకే షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో వారి సమాధానం కోసం ఏడు రోజుల గడువును ఇచ్చినట్లు చెబుతున్నారు. షోకాజ్ నోటీసులకు ఇచ్చిన జవా బు ఆధారంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు ఉంటాయని అధికార యంత్రాంగం చెబుతోంది. ఏడు రోజుల పాటు గడువు ఉన్నందున ఉన్నతాధికారులకు సమాధానం ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు మల్లగుల్లాలు పడుతున్నట్లు చెబుతున్నారు. తమపై చర్యలు తీసుకోవద్దంటూ అధికారులను వేడుకుంటున్నట్లు తెలిసింది. కాగా ఈ ఫేక్ అటెండెన్స్ విషయంలో పంచాయతీ కార్యదర్శులు ఇచ్చే సమాధానం కోసం జిల్లా అధికార యంత్రాంగం వేచి చూస్తున్నట్లు చెబుతున్నారు. ఇదివరకే ఇదే అంశంలో ఐదుగురిని సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఈ 82 మందిని సైతం సస్పెండ్ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. ఒకవేళ వీరికి వెసులుబాటు కల్పిస్తే సస్పెండ్ అయిన ఐదుగురికి సైతం వెసులుబాటు కల్పించాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. మొత్తానికి ఈ ఫేక్ అటెండెన్స్ జిల్లలో చర్యనీయాంశంగా మారింది. ఇందుకు పాల్పడిన వారి పట్ల ఎటువంటి చర్యలు తీసుకుంటారోనని ఇటు ప్రజలతో పాటు అటు ఇతర శాఖల అధికారులు వేచి చూస్తున్నారు.

సెక్రెటరీ సారు చెబితే ఫొటో నేనే అప్లోడ్ చేస్తుంటిని..

: సుద్దాల శ్రీనివాస్, మల్టీ పర్పస్ వర్కర్, చిన్న బెల్లాల్ గ్రామ పంచాయతీ



మా గ్రామ సెక్రెటరీ సార్ చెబితేనే ఆయన హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నేనే అప్లోడ్ చేస్తుంటిని. యాప్‌లో అటెండెన్స్ ఎలా అప్లోడ్ చేయాలో నాకు నేర్పించాడు. నా ఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసి ఇచ్చాడు. మాసారు నెలలో 15 రోజులు మాత్రమే డ్యూటీకి వస్తాడు. గ్రామ పంచాయతీ లో జరిగే పనులకు సైతం నేనే డబ్బులు పెడుతున్నాను. ఇప్పటికీ ఇంకా నాకు రూ.40వేలు రావాలి.

ఫేక్ అటెండెన్స్ అప్లోడ్ చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు

: శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, నిర్మల్



జిల్లాలో ఫేక్ అటెండెన్స్ అప్లోడ్ చేసిన పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవు. ఇదివరకే ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. మరో 82 మందికి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. వారిచ్చే సమాధానం ఆధారంగా చర్యలు ఉంటాయి. ఇటువంటి నిర్లక్ష్యపూరిత వైఖరిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు.


ఆలయంలో పూజలు చేస్తున్న అటవీశాఖ అధికారి

అడెల్లి ఆలయంలో ఐఎఫ్ఎస్ చీఫ్ ప్రత్యేక పూజలు

సారంగాపూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో మహా ప్రసిద్ధిగాంచిన అడెల్లి ఆలయంలో శుక్రవారం ఐఎఫ్‌చీఫ్ కన్సర్వేటర్ బాసర సర్కిల్ అధికారి శరవానన్ కుటుంబ సమేతంగా మొక్కులను మొక్కారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్, రామకృష్ణాగౌడ్, నజీర్‌ఖాన్, సంతోష్‌కుమార్, సంతోష్, వెన్నెల, సుజాత, ఎఫ్‌బీవోలు ఉన్నారు.


కుంటాలలోని మహాలక్ష్మీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కుంటాల మహాలక్ష్మీ ఆలయంలో మహిళల ప్రత్యేక పూజలు

కుంటాల, ఆగస్టు, 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని మహాలక్ష్మీ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా శ్రావణ మాసం రెండవ శుక్రవారం రోజు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తూ ఉంటారు. వరలక్ష్మీ వ్రతం రోజు మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటే కోరికలు నెరవేరుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలి : బీజేపీ

నిర్మల్ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కార్యశాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ విలాస్, కో కన్వీనర్లు నల్ల రవీందర్ రెడ్డి, సుష్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

● తానూర్ మండలంలో అత్యధికంగా 119.6 మిల్లీమీటర్లు ● జిల్లాలో 34.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

భైంసా, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం అర్ధరాత్రి వేళలో వాన దంచికొట్టింది. ఎకబిగిన గంటన్నరకు కాలానికి పైగా కురిసిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో వాగులు, ఆలుగులు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటల్లోకి భారీ వర్షపు నీరు వచ్చి చేరింది. ఇన్నాళ్ల వరకు అంతంత మాత్రంగానే కురిసిన వర్షాలతో వాగులు,వంకల్లో నామమాత్రంగా నీటి ప్రవహం కొనసాగగా గురువారం రాత్రి వేళ కురిసిన భారీ వర్షంతో పొంగిపొర్లి ప్రవహించాయి. ఇక నామమాత్రపు నీటి చేరికతో జల కళ లేని చెరువులు,కుంటలు భారీ వర్షంతో వచ్చిన వరద నీటితో నిండు కుండను తలపించే స్థితికి చేరుకున్నారు.

తానూర్‌లో అత్యధిక వర్షపాతం నమోదు

జిల్లాలో గురువారం అర్ధరాత్రి వేళలో సరాసరి 34.5 మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా తానూర్ మండలంలో 119.6 మి.మీటర్ల వర్షం కురిసింది. ఇక మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కుభీర్ మండలంలో 18 మి.మీటర్లు ,బాసర మండలంలో 62 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 98.2 మి.మీటర్లు,భైంసా మండలంలో 92.6 మి.మీటర్లు, కుంటాల మండలంలో 51.2 మి.మీటర్లు,నర్సాపూర్(జి) మండలంలో 31.8 మి.మీటర్లు,లోకేశ్వరం మండలంలో 56.2 మి.మీటర్లు, దిలావర్‌పూర్ మండలంలో 8.6 మి.మీటర్లు,సారంగపూర్ మండలంలో 12.4 మి.మీటర్లు,సోన్ మండలంలో 24.2 మి.మీటర్లు, లక్ష్మణ్‌చాంద మండలంలో 24.2 మి.మీటర్లు, పెంబి మండలంలో 40.2 మి.మీటర్లు,కడెం మండలంలో 9.2 మి.మీటర్లు వర్షపాతం నమోదవ్వగా నిర్మల్, నిర్మల్ అర్బన్, మామడ, దస్తూరాబాద్ ఖానాపూర్ మండలాల్లో నామమాత్రపు వర్షం కురిసింది.


కొత్త వెంకూర్-పాత వెంకూర్ గ్రామాల మధ్యలో లోలెవల్ వంతెనపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న నీరు


భైంసాలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తున్న పంట చేను

చెరువులు,కుంటలను తలపించిన లోతట్టు ప్రాంతాలు

భారీ వర్షంలో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని లోతట్టు క్షేత్రాలు, ఖాళీ స్థలాలు చెరువులు, కుంటలను తలపించాయి. గంటన్నర వ్యవధిలో ఎకబిగిన కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఉధృతితో ప్రవహించి ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, లోతట్టు క్షేత్రాలు, పంట చేలలో అధిక మొత్తంలో నిలిచిపోయాయి.దీంతో అక్కడి ప్రాంతాల్లో అధిక మొత్తంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువులు, కుంటలను తలపించేలా మారిపోయాయి.

కుంటాల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలోని వెంకూర్ వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో పాత వెంకూర్, కొత్త వెంకూర్ గ్రామాల మధ్యన గల లో లెవల్ వంతెన పై నుండి నీరు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు నీటి ఉధృతి కొనసాగింది.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత 15 రోజుల నుంచి వర్షం పడకపోవడంతో ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షం ఊరట కలిగించింది. ముథోల్ మండలంలో 98.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు చేరుకుంది. కొన్ని పంట పొలాలు సైతం వర్షం నీటితో కొంత మట్టుకు మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అలాగే మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వర్షం నీరు నిండుగా చేరుకుంది.

గడ్డెన్న ప్రాజెక్టులోకి 1700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నీటి నిల్వలు

భైంసా: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షం మూలంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి శుక్రవారం 1700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7మీటర్లు, 1.83 టీఎంసీలు ఉండగా, శుక్రవారం ప్రాజెక్టు నీటి మట్టం 357.6 మీటర్లకు చేరుకోగా, నీటి నిల్వలు 1.232 టీఎంసీలకు చేరుకున్నాయి. గురువారం ప్రాజెక్టు నీటిమట్టం 357.3 మీటర్లు, 1.091 టీఎంసీ నీటి నిల్వలు ఉండగా 1700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటి మట్టం 0.3 మీటర్లు పెరిగి 357.6 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వలు 1.091 టీఎంసీల నుంచి 1.232 టీఎంసీలకు పెరిగాయి. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టులోకి 0.877 టీఎంసీల నీటి నిల్వలు చేరుకున్నాయి. శుక్రవారం వరకు ఇక్కడి ప్రాంతంలో ప్రస్తుత వర్షకాలపు సీజన్‌లో 535.60 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి ఆయకట్టు భూములకు 40క్యూసెక్కుల సాగు నీటి విడుదల కొనసాగుతోంది.

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత


ప్రాజెక్టు గేటు ద్వారా నీరు వదిలిపెట్టిన దృశ్యం

సారంగాపూర్: మండలంలో గల స్వర్ణ ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్వర్ణప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యము 1183 అడుగులకు గాను 1183 అడుగుల వరద నీరు వచ్చి చేరడంతో సోమవారం ప్రాజెక్టు గేటును ఎత్తి 1954 వేళ క్యూసెక్కుల వరద నీరును దిగువ ప్రాంతానికి వదిలి పెట్టినట్లు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది దీంతో స్వర్ణ వాగు పరివాహన ప్రాంత రైతులు కూలీలు అప్రమత్తముగా ఉండాలని అధికారులు తెలిపారు. వాగులు వంకలు ఉప్పొంగడంతో చెరువులు కుంటలు వరద నీరుతో కళకళలాడుతున్నాయి.

రైతులు కాలానికి అనుగుణంగా మారాలి

● జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్

సోన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో ఏఐ సాంకేతికతతో భూసార పరీక్షలు, అగ్రిఫ్యాబ్రిక్స్ సంస్థ ఒకే గొడుగు కిందకు తేనుంది. దీనిలో భాగంగా వ్యవసాయ అవసరాలైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు, వ్యవసాయ యంత్రాలు, మార్కెటింగ్, సేంద్రియ వ్యవసాయ విధానంలో విలువ ఆధారిత పంటలను ఉత్పత్తి చేయనుంది. అలాగే, వాటిని బ్రాండ్ చేసి మార్కెట్ చేయడం, రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఒకే వేదికపై తీసుకొచ్చి బలోపేతం చేసే విధానంపై మండలంలోని జాఫ్రాపూర్‌లో శ్రీసాయి మ్యాక్స్ సభ్యులకు అవగాహన కల్పించారు. అగ్రిఫ్యాబ్రిక్స్ సంస్థ సీఈవో మెండు శ్రీనివాసులు తమ సంస్థ రైతులకు ఇచ్చే సర్వీస్‌ను జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్‌కి సంస్థ వెబ్‌సైట్ పని చేసే విధానాన్ని చూపిస్తూ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ... రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలని, వ్యవసాయంలో నూతన సాంకేతికతను ఇలాంటి సంస్థల ద్వారా తీసుకొని వ్యవసాయంలో సాంకేతిక విప్లవానికి నాంది పలకాలని అలాగే రైతులు నానో యూరియా, నానో డీఏపీని వాడాలని, దుక్కిలో యూరియా డీఏపీ వేసిన రైతులు మిగతా భాగాన్ని నానో రూపంలో మాత్రమే పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అందిస్తున్న సేవలకు అగ్రిఫ్యాబ్రిక్స్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఏఈవో అశోక్ కుమార్, సంస్థ ప్రతినిధి సాహిత్య, మాక్స్ అధ్యక్షుడు సాయిరెడ్డి, సభ్యులు ఉన్నారు.


సంస్థ వెబ్‌సైట్ పని చేసే విధానాన్ని వివరిస్తున్న జిల్లా అధికారి

మైనార్టీ పాఠశాలకు మండల ప్రత్యేకాధికారి

ముథోల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని బస్టాండ్ సమీపంలో గల ప్రభుత్వ బాలికల మైనార్టీ కళాశాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సుదర్శన్, ఎంపీడీవో శివకుమార్‌లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల, స్టాక్ రూమ్, భోజనాలు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను సంబంధిత ప్రిన్సిపాల్‌కు, విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే నయాబాదిలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి పలు సలహాలు సూచనలను ఇచ్చారు. అంతేకాకుండా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు. అలాగే పారిశుధ్యం పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో అన్వర్, తదితరులున్నారు.


● మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు